# వాన

చిటుకూ చిటుకూ చినుకులు.

అమ్మా! అంత అన్నం పెట్టు. . .

టక్కూ టక్కూ క్షుర చప్పుడు.

ధర్మతల్లీ! ఇంత బిచ్చం పెట్టు. . .

చీకట్లో చిక్కటి చీకటి ముద్దలాంటి ఆకారం.

మాదా కబళం తల్లీ!. . .

వీధులు వెలవెలబడుతున్నాయి. కరెంటు దీపాలు నీరసంగా వెలుగుతున్నాయి. చినుకులు నిర్లిప్తంగా రాలుతున్నాయి.

ముసలి ముష్టివాడి కడుపులో చక్రంలా తిరిగే ఆకలి. వైరివస్సులా నిలుచుంది వీధిమలుపు.

అమ్మా! ఒక్క ముద్ద పడెయ్యి, తల్లీ!

తలుపు మూసుకుంది.

ఛీ!. . .

నడవడానికి శక్తి లేదు.

అరవడానికి శక్తి లేదు.

అమ్మా!. . .

మండిపోయింది— ఛీ!

పెద్ద భవంతి ముందు భయంకరంగా మొరిగే కుక్క.

తల్లీ!

ఇంకా భోజనాలు కాలేదు— ఫో!...

భోజనాలు అయిపోయినా పెట్టరు; కాకపోయినా పెట్టరు.

చెవులు చల్లగా మంచు బిగిసింది.

అమ్మా! అన్నపూర్ణమ్మ తల్లీ!. . .

ఇంట్లో ఆవిడ పేరు అన్నపూర్ణో కాదో తెలియదు. ఆవిడ ఇంట్లో ఉందో లేదో తెలియదు. ఆవిడే కాదు, అసలింట్లో ఎవరికీ గొంతుకూడా ఉన్నట్టు లేదు. ఎవరూ పొమ్మనికూడా చెప్పలేదు.

పెంకుటింట్లోంచి యువకుడు మాత్రం గుర్రుగా అరిచాడు.

పొమ్మంటే పోవేరా, ముసలీ!. . . నీ కోసం ఎవరు వండి పెట్టారిక్కడ?...

పెద్ద హోటలు ముందు పెద్ద కార్లు తళుకులు, నవ్వులు.

అమ్మా! కాని దరమం వెయ్యండి...

డర్టీ ఇండియా— డర్టీ!

టాక్సీ దగ్గర కాలేజీ కుర్రాడు.

బాబూ! బాబూ!. . .

చిల్లర్లేదు పోరా!. . .

టీ కొట్టు కట్టేస్తున్న బట్టతల వాడు.

చలికి సచ్చిన్నాను—టీనీళ్లన్నా పొయ్యి, సామీ.

అప్పనంగా పోస్తే విన్నా మున్నా తాగిపోలా?

## కె. ఎన్వి. నరసింహం

డికాషన్ క్లోజయింది... ఎళ్లెళ్లు...

చినుకులు చిటుకూ చిటుకూ.

క్షురచప్పుడు టక్కూ టక్కూ.

చక్రంలా తిరిగే ఆకలి ముసలి బిచ్చగాడి కడుపులో.

గ్రాంఫోన్లోంచి ఆడా మగా పాడుతున్నారు.

నీవూ నేనూ ఒకటైతే
జగమే స్వర్గం కాదా. . .

నవ్వుకోడానికి శక్తి లేదు.

ఏడవడానికి శక్తి లేదు.

భగమంతుడా, నన్నెందుకు చంపెయ్యవు?. . .

వీధి కొళాయి తోపుడుబండి దగ్గర పిల్లలు.

బాబూ. . . నాయనా... దరమం... ముసిలోడికి దరమం. . .

ఏయ్! ఎక్కడా నువ్వు? పిల్లల్నెత్తుకు పోవాలని కాదూ?. . .

వేషం చూస్తే తెలీలా?

ఇలాంటోళ్ళని పోలీసులకి పట్టించాలి. . .

చిటుకూ చిటుకూ టక్కూ టక్కూ.

వాన చినుకులూ క్షుర చప్పుడూ.

ఈ రేత్తిరి కింతే! సస్తాన్నేను, సచ్చిపోతాను.

భగమంతుడా! ఏంటి నేనంచేశాం, సామీ.

సందులోంచి నల్లటి బలుపు హాయిగా పోతూంది.

ఎట్టా, ముసిలోడా? కళ్ళు మూసుకు పోయేట్రా?. . .

మీద మీద కొస్తావేం? కంపు ముఖం నువ్వూనూ. . .

చలి చలి చలి.

చలికే సస్తాను . . .

ఆకలికే సస్తాను . . .

పెద్ద కారులోంచి లేచొచ్చింది. కుక్క ఒళ్ళు విదిలించుకుంది. తోక తిప్పుకుంటూ వెళ్ళిపోయింది.

ఊర కుక్కగానన్నా పుట్టకపోతిని. ఛూ! యెదవ బతుకు ...

మేడలు ధీర బిగిసి నిలుచున్నాయి.

తడిసిన వీధులు అసహ్యంగా ఉడికాయి.

పాచిపోటి పెదవులకు లిప్స్టిక్కు నాగరికత.

అందం.

అసహ్యం.

ముసలి ముష్టివాడి కడుపులో ఆకలి మంట.

అసహ్యం మంట.

కోపం మంట.

ఛీ! ఎదవ మనుషులు. . .

నడుస్తూనే ఉన్నాడు.

ఊరు కాదిది. . . వల్లకాడు. . . ఛూ!. . .

ఊరికి దూరంగా నడుస్తున్నాడు.

వెళ్ళిపోతే వద్దనదు ఊరు. కళ్ళే గాని నోరుందా ఊరికి? కసరడాని కుంది. ప్రేమతో పిలవడాని కుందా?

ఆ లేడన్నా బండల్లో నవ్వడం మేలు. ఛూ. . . ఎదవ ఊరు. . .

గబగబా నడుస్తున్నాడు ముసిలాడు.

ఎక్కడికి? తెలీదు.

ఎందుకు? తెలీదు.

కాని—

ఈ మనుషుల ముఖం మళ్ళీ ఈ జన్మలో చూడను. . .

రోడ్డు వెనక్కి జారుతూంది.

టక్కూ టక్కూ—క్షురకి మొండి ఆవేశం వచ్చింది.

ఛూ! ఎదవ మనుషులు. . .

నడిచిపోతూనే ఉన్నాడు ముష్టివాడు.

• • •

తాతా! ఓ తాతా! ఇట్రా రో. . .

ఆగాడు ముసిలాడు.

గుడిసె ముందు పేద పడుచు...

అన్నముంది, యేస్తా రా, తాతా!. . .

ముసిలాడి ఒళ్ళు జలదరించింది. నిలువునా వణికిపోయాడు.

ఆదరా బాదరాగా ముందుకొచ్చాడు.

నా తల్లే!. . . నా తల్లే! !. .

చినుకులు పడుతుండాయి. . . యాడికెళతావ్—ఆ గోడ పక్కన కూసో . . . చారు మజ్జానంది. . . పోసేదా?

ఆత్రంగా తింటున్నాడు ముసిలాడు.

దీపాలు పెట్టేతలికి వత్తానన్నాడు అదు. . . ఇంకేం వత్తాడూ?. . . ఆ దొత్తాడని వండా. . . లోటా పట్టు నీళ్ళు పోత్తా... లేపోతే... అట్టా పడ— సెయ్యి కడుక్కుందూ గాని. . .

ముసిలాడి పెదవుల పేలవమైన నవ్వు.

చీకటి నిండిన ముఖంలో గుడ్డి వెలుతురు.

అదేటి? అదేటి, తాతా—అరె— ఎందు కేడుత్తుండావు?. . . ★

